- **తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబురాలు**



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో శనివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుక జరుపుకొన్నారు. బతుకమ్మ పాటలతో తెలంగాణ భవన్ హోరెత్తింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్ నాయకురాళ్లు ముక్తవరం సుశీలారెడ్డి, మన్నే కవితా రెడ్డి, సామల హేమ, పావని గౌడ్, రమాదేవి, సుమిత్ర ఆనంద్, సరోజ తదితరులు పాల్గొన్నారు. -హైదరాబాద్

# చేనేతలను ఆదుకోండి!

- **బతుకమ్మ చీరల తయారీలేక ఉపాధి కోల్పోయిన కార్మికులు**
- **పని కల్పించి చేరదీయాలని ప్రభుత్వానికి డిమాండ్**

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొంతకాలంగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పవర్‌లూమ్ కార్మికులను అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. తమను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. నేతన్నల ఆత్మహత్యలు నివారించేలా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గత ఏడేండ్లుగా రాష్ట్రంలో బతుకమ్మ చీరల తయారీ అవకాశం కల్పించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేత కార్మికులను ఆదుకున్న విషయం తెలిసిందే. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని నిలిపివేసింది. దీంతో పవర్‌లూమ్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న నేత కార్మికులకు ఆధారం లేకుండాపోయి రోడ్డునపడ్డారు. ఈ క్రమంలో ప్రభుత్వం తమకు పని కల్పించి ఆదుకోవాలని తెలంగాణ నేత కార్మిక సంఘం నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే తమ డిమాండ్ల సాధనకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.



కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

# ఇసుక అక్రమ రవాణాలో 61 మందిపై కేసులు

## మొన్న ఏడుగురు.. నేడు 53 మంది రిమాండ్

జమ్మికుంట, అక్టోబర్ 5 : మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేసిన 61 మందిపై కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ రవి కేసులు నమోదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఏడుగురు.. శనివారం సాయంత్రం 53 మంది ఇసుకాసురులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని శంభునిపల్లి సమీపంలో కొందరు అక్రమార్కులు మానేరు నుంచి ఇసుక తోడి డంపుగా నిల్వ చేశారు. గమనించిన పలువురు అధికారులకు ఫిర్యాదు చేయగా, సదరు ఇసుక డంపును సీజ్ చేశారు. 1,500 ట్రిప్పుల ఇసుక ఉన్నట్టు అంచనా వేశారు. ఒక్కో ట్రిప్పునకు లెక్కగట్టారు. మొత్తంగా రూ.27 లక్షలుగా నిర్ణయించారు. డంపులో ఉన్న ఇసుకను గత నెల 2న వేలం వేస్తున్నట్టు జమ్మికుంట తహసీల్దార్ రమేశ్‌బాబు ప్రకటన జారీ చేశారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వేలం వేశారు. అంచనాలకు మించి సమీప గ్రామానికి చెందిన రమేశ్ అనే వ్యక్తి రూ.53 లక్షలకు ఇసుక డంపును దక్కించుకున్నాడు. వేలం పాట డబ్బులను పది రోజుల్లోగా రెవెన్యూ శాఖకు చెల్లించాడు. డంపును నెల రోజుల్లోగా ఖాళీ చేయాలని తహసీల్దార్ చెప్పారు. అయితే.. ఇసుక డంపును కాంట్రాక్టర్ రమేశ్‌తో పాటు మాధవరావు తదితరులు లారీల ద్వారా దూర ప్రాంతాలకు తరలించడం ప్రారంభించారు. ఇదే సమయంలో.. మాధవరావు తదితరులు కలిసి విలాసాగర్, తనుగుల, గంగ్రపల్లి తదితర గ్రామాలకు చెందిన ఇసుక అక్రమ రవాణాదారులను కలిశారు. డంపు వద్దకు ఇసుక అక్రమంగా రవాణా చేసుకున్నారు. గత నెల 26న నాలుగు లారీలు ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీలతోపాటు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కాంట్రాక్టర్ మాధవరావును అదుపులోకి తీసుకుని విచారించారు. దశల వారీగా 61 మందిపై కేసు నమోదు చేశారు. తొలుత ఏడుగురిని.. తర్వాత ఇసుక డంపు వద్దకు అక్రమంగా రవాణా చేసిన 53 మంది ఇసుక యజమానులు, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు. తనుగులకు చెందిన ఒకరు పరారీలో ఉన్నాడని చెప్పారు. దర్యాప్తు సాగుతున్నదని, మరికొందరిపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.


### సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ కారు ఢీకొని వృద్ధురాలికి

# తీవ్ర గాయాలు



స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ కారు ఢీకొని వృద్ధురాలు గాయపడింది. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయరహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగారపు పద్మ రోడ్డుదాటుతుండగా సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధురాలి తల, చేతికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కారును అడ్డుకొని 108కు సమాచారమందించగా వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. అడిషనల్ కలెక్టర్ కూడా దవాఖానకు వెళ్లి క్షతగాత్రురాలిని పరామర్శించినట్టు సమాచారం.

# కుమారుడి పెండ్లి వేళ ప్రమాదంలో తండ్రి మృతి



తొగుట, అక్టోబర్ 5: మరికొద్ది గంటల్లో కుమారుడి పెండ్లి జరగాల్సి ఉండగా.. రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేట శివారులో చోటుచేసుకున్నది. రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఖాసీం చిన్న కుమారుడు నిజాముద్దీన్ పెండ్లి శనివారం జరగాల్సి ఉన్నది. మహ్మద్ ఖాసీం తోపాటు భార్య సాహెరా, మరో కుమారుడు వసీయొద్దీన్‌తో కలిసి కారులో గజ్వేల్ నుంచి వస్తుండగా శనివారం తెల్లవారుజామున వెంకట్రావుపేట శివారులో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఖాసీం అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్య సాహెరా, కుమారుడు వసీమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తొగుట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

- **నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ రాస్తారోకో**



సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించాలంటూ నినాదాలు చేశారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వారు మండిపడ్డారు. – బెల్లంపల్లి

# కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద కిడ్నాప్ కలకలం

- **దాడిచేసి కారులో ఎత్తుకెళ్లిన దుండగులు**
- **వెల్దండ మండలం యెన్నం వదిలిన వ్యక్తులు**
- **నయీం అనుచరులు కావచ్చని స్థానికుల అనుమానం**

కడ్తాల్, అక్టోబర్ 5: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఓ వ్యక్తి కిడ్నాప్ అయిన ఘటన కలకలం రేపింది. కడ్తాల్ సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన పిట్ల కతల్ శనివారం తన కుమారుడు శ్యామ్‌కుమార్, బాబు, డ్రైవర్ విజయ్‌తో కలిసి కారులో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు ఓ పని నిమిత్తం వెళ్లారు. పని ముగించుకొని తిరుగు ప్రయాణం కాగా మార్గమధ్యంలోని కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద కతల్ ప్రయాణిస్తున్న కారును నలుగురు వ్యక్తులు ఆపి రాళ్లతో దాడి చేశారు. కారు అద్దాలు పగులగొట్టి ముందు సీటులో కూర్చున్న కతల్‌ని కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేసి, తెలుపు రంగు షిఫ్ట్ కారులో కతల్‌ని బలవంతంగా ఎక్కించుకొని ఆమనగల్లు వైపు వేగంగా వెళ్లారు. కతల్‌ను కిడ్నాప్ చేసిన వారిలో బద్రియాదవ్, నిజాంతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కతల్ కుమారుడు శ్యామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, కిడ్నాపర్లు కతల్‌ను వెల్దండ మండలం యెన్నం దవాఖాన సమీపంలో వదిలి వెళ్లినట్టు గుర్తించారు. కతల్‌ను కిడ్నాప్ చేసింది నయీం అనుచరులై ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# పీఏసీఎల్ స్కామ్‌లో ఈడీ జోరు

## తెలంగాణ సహా 8 రాష్ట్రాల్లో సోదాలు.. పలు కీలక పత్రాలు, డిజిటల్ సామగ్రి స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ఉత్తరాఖండ్‌లోని పెరల్స్ ఆగ్రో కార్పొరేషన్ లిమిటెడ్ (పీఏసీఎల్) కుంభకోణంలో ఢిల్లీ జోన్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దేశ వ్యాప్తంగా 44 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను, డిజిటల్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 2018లో సీబీఐ నమోదు చేసిన వివిధ ఎఫ్ఐఆర్‌లను ఆధారంగా చేసుకుని మనీ లాండరింగ్ చట్టం కింద ఈడీ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నది. ల్యాండ్ డెవలప్‌మెంట్ ముసుగులో పీఏసీఎల్ కంపెనీ దాదాపు 5.8 కోట్ల మంది ఖాతాదారుల నుంచి రూ.49,100 కోట్లు సేకరించి, మనీ లాండరింగ్‌కు పాల్పడింది. ఆ సొమ్మును పీఏసీఎల్ డైరెక్టర్లు కోల్‌కతాలోని డొల్ల కంపెనీలకు బదిలీ చేశారు. ఆ తర్వాత ఆ షెల్ కంపెనీలను ఢిల్లీలోని ముఖ్య సహచరులకు కట్టబెట్టారు. ఈ నిధులను ఢిల్లీ నుంచి హవాలా మార్గం ద్వారా దుబాయ్‌కి తరలించి విదేశాల్లో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్టు ఈడీ గతంలోనే గుర్తించింది. అనంతరం 2018లో ఆస్ట్రేలియాలోని రూ.462 కోట్ల విలువైన 2 స్థిరాస్తులను, 2022లో మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూ.244 కోట్ల విలువైన స్థిరాస్తులను జప్తు చేసింది.

